www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 22 డిసెంబరు 2022
5
ఏలూరు



## పోలీస్ నియామకాల్లో వయోపరిమితి పెంచాలి : డివైఎఫ్ఐ

జంగారెడ్డిగూడెం:ఇటీవల పోలీస్ శాఖలో విడుదల చేసిన నియామకాల నోటిఫికేషన్‌లో అభ్యర్థులకు ఐదు సంవత్సరాల వయోపరిమితి పెంచాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం మండల కార్యదర్శి ఎం.వెంకట్రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ నిరుద్యోగులు నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న పోలీసుల నియామకాలపై విడుదలైన నోటిఫికేషన్ వల్ల తీవ్ర నిరాశకు గురయ్యారన్నారు. ఐదేళ్లకు వయోపరిమితి పెంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా నోటిఫికేషన్ ఉంటుందని మాట ఇచ్చి ఇప్పుడు మడమ తిప్పడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పలు శాఖల్లో ఖాళీగా ఉన్న రెండు లక్షల 35 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులను ఐక్యం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అగ్నికీలలు.. ఆర్తనాదాలు



ఎగసిపడుతున్న అగ్నికీలలు
దగ్ధమైన ప్లాంట్
గాయపడిన చరణ్
గాయపడిన దుర్గాప్రసాద్
క్షతగాత్రుణ్ని ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

### ఫోరస్ ఘటనను తలపించిన ఫుడ్‌ఫ్యాట్స్ ప్రమాదం
### ఐదుగురు కార్మికులకు గాయాలు : మరొకరి ఆచూకీ గల్లంతు
### ఎగసిన మంటలతో తాడేపల్లిగూడెం ప్రాంతవాసులు బెంబేలు
### సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మంత్రి కారుమూరి, అధికారులు
### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు

**సమయం మధ్యాహ్నం మూడు గంటలు.. గంట క్రితమే విధుల్లోకి వచ్చిన కార్మికులంతా తమ పనుల్లో బిజీగా ఉన్నారు.. ఒక్కసారిగా భారీ పేలుడు.. ఎగసిపడిన అగ్నికీలలు.. తేరుకునేలోపు ఫ్యాక్టరీని చుట్టుముట్టిన మంటలు.. కార్మికులంతా ఉరుకులు..పరుగులు.. అరుపులు.. కేకలు.. ఇదీ తాడేపల్లిగూడెం పట్టణ శివారులోని పెంటపాడు మండలం ప్రతిపాడు గ్రామ పరిధిలో ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీలోని ఎస్ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో బుధవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ప్రమాదం తీరు. ఈ ప్రమాదానికి సంబంధించి ప్రత్యక్ష సాక్షులు, పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు, కార్మికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.**

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం/ఉంగుటూరు**

ఫుడ్‌ఫ్యాట్స్ అండ్ ఫెర్టిలైజర్స్‌లో బుధవారం మధ్యాహ్నం కార్మికులు రెండో షిఫ్టులో చేరిన కొద్దిసేపటికే ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. పరిశ్రమలోని ఎస్ఎఫ్-1 సాల్వెంట్ ప్లాంట్‌లో మధ్యాహ్నం 3.20 గంటలకు పేలుడు సంభవించి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో పరిశ్రమలో ఇతర విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు, తాడేపల్లిగూడెం ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. మంటలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో అటువైపు ఎవరూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఆ ప్లాంట్‌లో పని చేస్తున్న ఆరుగురిలో ఐదుగురు గాయాలతో బయట పడగా మరొకరి ఆచూకీ గల్లంతైంది.


సాల్వెంట్ ప్లాంట్‌లో కార్మికులు మూడు షిఫ్టులుగా పని చేస్తారు. మధ్యాహ్నం షిఫ్టులో తాడేపల్లిగూడెంకి చెందిన బి.చరణ్ (32), అలంపురానికి చెందిన తాళ్లూరి దుర్గాప్రసాద్ (30), తణుకుకు చెందిన కోన నాగబాబు (41), జగన్నాధపురానికి చెందిన గడ్డం బాబ్జీ (32), జార్ఖండ్‌కు చెందిన సునీల్‌కుమార్ గాయాల పాలయ్యారు. వీరిలో చరణ్, దుర్గాప్రసాద్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం రాజమండ్రి తరలించారు. కుంచనపల్లికి చెందిన మల్లికార్జునరావు ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈయన పేలుడు సంభవించిన ప్రాంతానికి అతి సమీపంలో ఉండటంతో ప్రమాదం నుంచి బయటపడే అవకాశం లేదని అంచనా. అదే ప్లాంట్‌లో ఇన్సులేషన్ పని చేస్తున్న ఏడుగురు కార్మికులు పేలుడు సమయానికి కొన్ని నిమిషాల ముందు టీ తాగేందుకు వెళ్లడంతో వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాద విషయం తెలియగానే తాడేపల్లిగూడెం అగ్నిమాపక శాఖ సిబ్బంది రంగంలోకి దిగి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే సాయంత్రం కావడం, చీకటి అలుముకోవడం, ప్రమాదం సంభవించిన ప్లాంట్ కుప్పకూలే ప్రమాదం ఉండటంతో ఎవరూ లోపలికెళ్లకుండా ఆ ప్రాంతాన్ని సీజ్ చేశారు. సమాచారం తెలియగానే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు కార్మికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, ఆర్‌డిఒ దాసి రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఆ ప్లాంట్ వద్దకు ఎవరూ వెళ్లకుండా సీల్ వేశామని, గురువారం ఉదయం సంబంధిత శాఖల అధికారులు, ఫోరెన్సిక్ నిపుణుల సాయంతో ప్లాంట్‌లోకి వెళ్లి ఆచూకీ తెలియని కార్మికుని గురించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ సాగిస్తామని వారు తెలిపారు. సంఘటనా స్థలాన్ని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తనయుడు కొట్టు విశాల్ పరిశీలించారు.

**క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి : సిఐటియు**

ఫుడ్‌ఫ్యాట్స్ పరిశ్రమలో ప్రమాద ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వారు ప్రమాదస్థలాన్ని సందర్శించి కార్మికులతోను, ఫ్యాక్టరీ యాజమాన్యంతోను, అధికారులతోనూ మాట్లాడారు. ప్రమాదంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి కారణాలు గుర్తించాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆచూకీ తెలియకుండా పోయిన కార్మికుని వివరాలు వీలైనంత త్వరగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

**పరిశ్రమల్లో ప్రమాద ఘంటికలు**

ఏలూరు జిల్లాలోని ముసునూరు మండలం అక్కిరెడ్డిగూడెంలోని పోరస్ కంపెనీలో కొన్ని నెలల క్రితం పేలుడు సంభవించి 12 మంది కార్మికులు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఫుడ్‌ఫ్యాట్స్‌లో బుధవారం చోటుచేసుకున్న ప్రమాదంతో కార్మికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలో పని చేయడానికి తమ వారు ఎలాగున్నారోనని కార్మికుల కుటుంబ సభ్యులు పెద్దసంఖ్యలో పరిశ్రమ వద్దకు పరుగులు తీశారు. ఒక కార్మికుని ఆచూకీ తెలియకపోవడంతో ఆయన కుటుంబ సభ్యులు తల్లడిల్లుతున్నారు. అదే సమయంలో రాజమండ్రి తరలించిన చరణ్, దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు కూడా ఆందోళనకు గురవుతున్నారు. మొగల్తూరులో ఆనంద రొయ్యల పరిశ్రమలో కార్మికులు మృత్యువాత తర్వాత పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటూ కార్మికులు మృత్యువాత పడటం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్‌లుగా మార్చడంతో పరిశ్రమలపై పర్యవేక్షణ సంబంధిత శాఖల నుంచి పూర్తిగా కొరవడింది. ఫలితంగా వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాల్లో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.



ఆందోళన చేస్తున్న నిర్వాసితులు, నాయకులు

# పునరావాస కాలనీల్లో శ్మశాన వాటికలేవీ

## తక్షణమే స్థలాలు కేటాయించాలి: సిపిఎం

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని నిర్వాసితుల పునరావాస కాలనీల్లో శ్మశాన వాటికల్లేక జనం చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణం ఆయా కాలనీల్లో శ్మశాన వాటికలకు స్థలాలు కేటాయించాలని సిపిఎం బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం మండలంలోని సిరివాక, కోరుటూరు, గాజులగొంది, టేకూరు, కొత్తమామిడిగొంది, వాడపల్లి, ఎర్రవరం పునరావాస కాలనీల్లో సిపిఎం బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు భూమికి భూమి సరిహద్దులతో కేటాయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొరుటూరు, టేకూరు నిర్వాసితులకు పట్టాలిచ్చినా భూములను వారికీ అప్పగించకపోవడంతో వ్యవసాయం చేసేందుకు భూములు లేవన్నారు. కొన్నిచోట్ల వివాదాలున్న భూములే అధికంగా నిర్వాసితులకు ఇచ్చారని తెలిపారు. భూమిని ఎప్పటికిస్తారో తెలియని అయోమయ పరిస్థితుల్లో నిర్వాసితులున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. భూమికి భూమి ఇవ్వాలని, లేనిపక్షంలోఅమరావతి రైతులకు ఇచ్చినట్లే ఫించను ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఆర్ఒఎఫ్ఆర్ భూమికి భూమి ఇవ్వాలన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, చెట్ల పరిహారం, 18 ఏళ్ల యువతకు ప్యాకేజీ తక్షణమే విడుదల చేయాలన్నారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ బృందంలో నేతలు తెల్లం దుర్గారావు, వై.నాగేంద్రరావు, జి.వెంకట్రావు, సీతారామయ్య, డి.రమేష్, పోలోజు నాగేశ్వరరావు, కారం భాస్కర్ తదితరులు ఉన్నారు.

# సిఐటియు రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

భీమవరంలో జనవరి 2, 3, 4 తేదీల్లో జరగనున్న సిఐటియు రాష్ట్ర మహాసభలో పెద్దసంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పిలుపునిచ్చారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ జనవరి 2న వేలాది మందితో భారీ ర్యాలీ, బహిరంగ సభ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి ఆది కృష్ణ, నేత సాల్మన్‌రాజు, రైతు సంఘం నేత కట్టా భాస్కర్‌రావు, భవననిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బండారు శివాజీ తదితరులు పాల్గొన్నారు.



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్

# శరవేగంగా జగనన్న గృహ నిర్మాణాలు

## జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ టి.వేణుగోపాల్

**ప్రజాశక్తి - చింతలపూడి**

జిల్లాలో జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతమయ్యాయని జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ టి.వేణుగోపాల్ తెలిపారు. మండలంలోని సుప్రింపేటలోని జగనన్న లే-అవుట్‌లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 శాతం ఇళ్లు పునాధులు పూర్తయ్యాయన్నారు. పిఎంఎవై గృహాలు 15వేలు, రాష్ట్ర ప్రభుత్వం 89 వేల ఇళ్లు మంజూరు చేసిందన్నారు. వచ్చే నెలాఖరుకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చింతలపూడిలో 924 గృహనిర్మాణాలపై పూర్తి దృష్టిసారించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాంబాబు, హౌసింగ్ ఎఇ, ఇంజినీరింగ్ ఆసిస్టెంట్లు పాల్గొన్నారు.




పోటీలకు విచ్చేసిన క్రీడాకారులు

# సపక్‌తక్రా అండర్-19 రాష్ట్రస్థాయి పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 బాల బాలికల సపక్‌తక్రా క్రీడా పోటీలు నారాయణపురంలోని వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ పోటీలకు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి క్రీడాకారులు విచ్చేశారు. తొలిరోజు పోటీలను సర్పంచి దిడ్ల అలకనంద ప్రారంభించారు. ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ ఆదిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగూర్ సాహెబ్ పాల్గొన్నారు. తొలిరోజు పోటీల్లో బాలికల విభాగంలో పశ్చిమగోదావరి, చిత్తూరు, గుంటూరు జట్లు, బాలుర విభాగంలో పశ్చిమగోదావరి, ప్రకాశం జట్లు గెలుపొందాయని నిర్వాహకులు తెలిపారు.



విచారణ చేపడుతున్న అధికారులు

# భూముల వివాదంపై విచారణ

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని పి.అంకంపాలెం పంచాయతీలోని పి.నారాయణపురంలో నిర్వాసితులకు కేటాయించిన భూములకు సంబంధించిన వివాదంపై స్పందనలో ఫిర్యాదు అందడంతో ఎస్‌డిసి సూర్యనారాయణరెడ్డి బుధవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు కేటాయించిన భూముల్లో అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేసిన వారి వద్ద నుంచి వివరాలు తెలుసుకున్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని, నిర్వాసితుల భూముల విషయంలో శాశ్వత పరిష్కారం చూపుతామని సూర్యనారాయణరెడ్డి తెలిపారు. ఆయనతోపాటు తహశీల్దార్ గెడ్డం ఎలీషా, విఆర్ఒ ముత్యం, సర్వేయర్లు పాల్గొన్నారు.

# మహిళలపై నేరాల పెరుగుదల ఆందోళనకరం

**ప్రజాశక్తి - ఏలూరు**

మన రాష్ట్రంలోనే అత్యధికంగా మహిళలపై నేరాలు జరగడంపై ఐద్వా ఏలూరు జిల్లా కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం స్థానిక పవర్‌పేటలోని అన్నే అనసూయమ్మ ఐద్వా భవనంలో జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ పి.హైమావతి మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలోనే స్త్రీలపై, బాలికలపై అత్యాచారాలు, నేరాలు పెరుగుతున్నాయని పార్లమెంట్ సాక్షిగా ప్రకటించడం ఆందోళన కలిగిస్తోందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన మత ఎజెండ, మూఢత్వభావాలు పెంచడం వల్ల ఈ దాడులు పెరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్రాలు విఫలమవుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో 2019లో 1086 అత్యాచార కేసులు నమోదైతే, 2020లో 4886 కేసులు, 2021లో 5101 కేసులు నమోదయ్యాయన్నారు. దీన్నిబట్టి పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. మహిళలపై అకృత్యాలను అరికట్టాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి, త్వరితగతిన దోషులకు శిక్షలు విధించాలని కోరారు. సినిమాలు, సీరియల్స్, ఇంటర్నెట్‌లో వస్తున్న అశ్లీలత, హింసను అరికట్టాలని డిమాండ్ చేశారు. డి.వరలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎన్.పద్మాంజలి, పి.వెంకటరమణ, కె.రాజ్యలక్ష్మి, ఎం.కుమారి, ఎన్.నిర్మల, దివ్య, ఎస్‌కె.సుభాషిణి పాల్గొన్నారు.

# కార్మిక హక్కులపై అవగాహన

**ప్రజాశక్తి - ఏలూరు**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మికులకు ఫ్యాక్టరీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో యాజమాన్యంపై చర్యలుంటాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కొత్తూరులోని జ్యూట్ మిల్లులో కార్మిక హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్మికులు పనిచేసే ఫ్యాక్టరీల్లో వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, అలాగే కార్మికులు కూడా బాధ్యతాయుతంగా పనిచేస్తే సంస్థ అభివృద్ధితోపాటు కార్మికులకు, యాజమాన్యానికి మంచి సంబంధాలుంటాయని, తద్వారా కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. అలాగే కార్మికులకు న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించొచ్చని, 2023, ఫిబ్రవరి 11వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న లేదా తదితర కేసులను ఈ జాతీయలోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవచ్చని, కక్షిదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# శాంతి, సంతోషాలకు చిహ్నం.. క్రిస్మస్

## డిపిఆర్ఒ ఎస్.భవాని



కేకును కట్ చేస్తున్న ఎస్.భవాని

**ఏలూరు:**శాంతి, సంతోషానికి చిహ్నం క్రిస్మస్ అని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని అన్నారు. బుధవారం డిపిఆర్ఒ కార్యాలయంలో కార్యాలయ సిబ్బందితో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో కులమతాలకు అతీతంగా సిబ్బంది అన్ని పండుగల్లోనూ భాగస్వాములు కావడం స్వాగతించాల్సిన విషయమన్నారు. ప్రతి ఒక్కరూ క్షమాగుణంతో సర్వ ప్రాణులను ప్రేమిస్తే యావత్ ప్రపంచం సుఖశాంతులతో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఒ ఆర్‌విఎస్.రామచంద్రరావు, ఎవిఎస్‌సిహెచ్.రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కె.సూర్యనారాయణ, టైపిస్టు డి.శౌరిప్రసాద్, రికార్డు అసిస్టెంట్ టి.బాబూరావు, కార్యాలయ సిబ్బంది వీడియో కెమెరామెన్ సంధ్యా కమల, ఫొటో గ్రాఫర్ పి.సాగర్, పి.వీరభద్రం, పి.శారద, జివివి.రత్నం, రామారావు పాల్గొన్నారు.

# యువత పరిశ్రమలు నెలకొల్పాలి

## పరిశ్రమల శాఖ జిఎం ఏసుదాసు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

నిరుద్యోగ సమస్యకు పరిష్కారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను యువత అందిపుచ్చుకుని పరిశ్రమలు నెలకొల్పాలని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పి.ఏసుదాసు సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించేందుకు ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇడిపి) నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు నెలకొల్పిన వారికి ప్రభుత్వం పలు రకాల పథకాలు అమలు చేస్తుందన్నారు. ఐడిపి 2020-23 పారిశ్రామిక విధానం వచ్చే మార్చి 31తో ముగుస్తుందన్నారు. ఈ పథకం ద్వారా ఎంఎస్ఎంఇ యూనిట్లు స్థాపించే జనరల్ కేటగిరీ వారికి 15 శాతం, బిసి, మైనారిటీ మహిళలకు 35 శాతం , ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రాజెక్టు వ్యయంలో 45 శాతం సబ్సిడీగా లభిస్తుందన్నారు. పరిశ్రమల స్థాపనకు కావలసిన అనుమతుల కోసం సింగిల్ డెస్క్ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తే 21 రోజుల్లోపు అనుమతులు లభిస్తాయన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రుణాలను సక్రమంగా బ్యాంకులకు తిరిగి చెల్లిస్తే వారి సిబిల్ రేటు పెరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతంలోని భూములను కూడా ల్యాండ్ కన్వర్షన్ అయ్యి ఉంటే సెక్యూరిటీగా పరిగణిస్తామన్నారు. ఎపి ఫైనాన్షియల్ కార్పొరేషన్ సీనియర్ మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ఎంటర్‌ప్రెన్యూర్ ఎంచుకున్న యాక్టివిటీకి సంబంధించిన సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసుకుని ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్‌ను సంప్రదించాలన్నారు. ఎపిఎస్ఎస్‌సి అమలు చేసే స్కీముల గురించి వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి పరిశ్రమల శాఖ చేపట్టే కార్యక్రమాలు వివరించారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్లు నాగేంద్ర భూపాల్, యువరాం కిషోర్ పాల్గొన్నారు.

# మెరుగైన విద్యకు ప్రభుత్వం ప్రాధాన్యత

## జెసి అరుణ్‌బాబు - జిల్లాలో 20,625 ట్యాబ్‌ల పంపిణీ

**ప్రజాశక్తి - ఏలూరు**

దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మెరుగైన విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నారని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా జిల్లాలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్‌లో రీజనల్ జాయింట్ డైరెక్టర్ దుక్కుపాటి మధుసూధనరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిధిగా అరుణ్‌బాబు మాట్లాడుతూ ఎనిమిదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ ట్యాబ్‌లు అందజేస్తారన్నారు. ప్రతి సంవత్సరం ఏడో తరగతి ఉత్తీర్ణులై ఎనిమిదో తరగతిలో చేరే వారందరికీ ట్యాబ్‌లు అందజేస్తారని తెలిపారు. సాధారణ విద్యార్థులు ఇంటికి వెళ్లి ఈ ట్యాబ్‌ల ద్వారా తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ ట్యాబ్‌ల ఉపయోగం పాఠాల వరకు పరిమితమని, ఎటువంటి వీడియోలు, ఫొటోలు తీయడానికి పని చేయవని చెప్పారు. విద్యార్థులు ఈ ట్యాబ్‌లను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ఎనిమిదో తరగతి చదువుతున్న 18,370 మంది విద్యార్థులకు, 2,255 మంది ఉపాధ్యాయులకు మొత్తం 20,625 ట్యాబ్‌లు ఈ నెల 28వ తేదీలోగా పంపిణీ చేస్తారన్నారు. ఆర్‌జెడి మధుసూదనరావు మాట్లాడుతూ ట్యాబ్‌లను సక్రమమైన రీతిలో వినియోగించుకోవాలని కోరారు. అనంతరం 60 మంది విద్యార్థులకు జెసి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏలూరు డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, ఎఎంసి ఛైర్మన్ నెర్సు చిరంజీవి, ఏలూరు కోఆప్షన్ సభ్యులు జాన్ గురునాథ్, కార్పొరేటర్లు హేమమాధురి దుర్గారావు, భీమవరపు హేమ సుందరి, డివైఇఒ లావణ్య, ప్రధానోపాధ్యాయుడు పి.కుటుంబరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి

## జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు

**ప్రజాశక్తి - ఏలూరు**

బాల్య వివాహాల నిరోధానికి అంతా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిరోధానికి పురోహితులకు అవగాహనా కార్యక్రమం నవసమాజ్ సొసైటీ ఛైర్మన్ నేతల రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథి అరుణ్‌బాబు మాట్లాడుతూ హిందూ వివాహాలు నిర్వహించే పురోహితులు 18 సంవత్సరాలు నిండని బాలికలకు, 21 సంవత్సరాలు నిండని బాలురకు ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహాలు జరిపించకుండా చూడాలన్నారు. బాల్య వివాహాల నిరోధానికి నవసమాజ్ సొసైటీ లాంటి స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్, డిసిపిఒ డాక్టర్ సూర్యచక్రవేణి, ఏలూరు ఎంపిడిఒ డాక్టర్ బి.ప్రణవి, క్రాప్ సంస్థ ప్రోగ్రాం డైరెక్టర్ పి.ఫ్రాన్సిస్, తంబి, లీగల్ అడ్వైజర్ చిక్కా భీమేశ్వర, గాయత్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు దువ్వూరి సూర్య నారాయణశర్మ, దాసరి నాగేంద్ర కుమార్, ఎల్ఐసి రాజా, భూపతి అప్పారావు, మేడిశెట్టి గిరిబాబు, కర్రి వేణు గోపాలరావు, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

## గెస్ట్ అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పివివిఎస్.మహేంద్రరావు తెలిపారు. సంబంధిత కామర్స్ సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో పాటు కామర్స్ సబ్జెక్టులో నెట్, సెట్, పిహెచ్‌డి, వంటి అర్హతలున్నవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మొదటి ప్రాధాన్యత పిహెచ్‌డి చేసిన వారికి ఉంటుందన్నారు. ఆ తరువాత నెట్, సెట్ చేసిన వారికి ఉంటుందని, ఈ అర్హతలు లేని కామర్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసిన వారిని తరువాత ప్రాధాన్యతగా తీసుకుంటామని ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 29వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, జనవరి నాలుగో తేదీన ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన, డెమో మౌలిక పరీక్షలు జరుగుతాయని తెలిపారు.



ఇ-క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

## ఇ-క్రాప్‌లో పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ముసునూరు

రైతులు తమ పంట వివరాలను ఇ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు అన్నారు. ముసునూరులో రబీ పంట కాలంలో నాటిన మొక్కజొన్న, పొగాకు, అరటి తదితర పంటలు ఇ-క్రాప్ బుకింగ్‌పై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు.

## ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చోడగిరికి అభినందన

ప్రజాశక్తి - ఏలూరు

ఇటీవల ఎన్నికైన ఎపి ఎన్‌జిఒ సంఘం జిల్లా అధ్యక్షులు చోడగిరి శ్రీనివాసరావును చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిచ్చుక ఆదిశేషు బుధవారం ఉదయం స్థానిక ఎన్‌ఆర్ స్టేడియం వెనుక ఉన్న జల వనరుల శాఖ కార్యాలయంలో నూలుదండ వేసి అభినందించారు. ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సిహెచ్.దేవప్రకాష్, డిఇఇ బి.శ్రీనివాస్, టెక్నికల్ ఆఫీసర్ వెంకటపతిరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.



వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రాధా

## ప్రజానేత.. వంగవీటి రంగ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రజా నాయకుడు వంగవీటి మోహనరంగా అని ఆయన తనయుడు వంగవీటి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారిగూడెం, రుద్రరేకులవారిగూడెం, గంగినీడిపాలెం, మక్కినవారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో కాపునేత వంగవీటి రంగ విగ్రహాల దాత సాధనాల నరసింహారావు ఏర్పాటు చేసిన విగ్రహాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాధాకృష్ణ మాట్లాడుతూ శాసనసభ్యులుగా కొద్ది కాలం పనిచేసినప్పటికీ పేదలకోసం పదవులు లెక్కపోయినా పనిచేశారని, పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆయన చనిపోయి 35 ఏళ్లయినా ఆయనపై ప్రజల్లో ఉన్న అభిమానం గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఛైర్మన్ కరాటం రాంబాబు, ఎఎంసి మాజీ ఛైర్మన్ జెట్టి గురునాధరావు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, పోల్నాటి బాబ్జీ, శీలం వెంకటేశ్వరరావు, ఎల్లిన వెంకటరత్నం, కాల్నీడి సుబ్బారావు, అడపా నాగరాజు, తోట లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎలిజాకు కరాటం పరామర్శ

జంగారెడ్డిగూడెం:ఎమ్మెల్యే ఎలిజాను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కరాటం రాంబాబు బుధవారం పరామర్శించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎలిజాను కరాటం కలిశారు. మంగళవారం కారు ప్రమాదానికి గురైన ఎమ్మెల్యే, కుటుంబ సభ్యుల సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో సురక్షితంగా బయటపడటం సంతోషదాయకమన్నారు. ఆయన వెంట వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న కరాటం రాంబాబు

## నేరాలు - ఘోరాలు

### మందుబాబులకు జరిమానా

ప్రజాశక్తి - భీమడోలు

మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిని అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్ఐ చావా సురేష్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి బుధవారం భీమడోలు కోర్టులో హాజరు పరిచామన్నారు. విచారణ అనంతరం న్యాయమూర్తి టి.ఆదిత్య రిషిక్ ఒక్కొక్కరికి రూ.పదివేలు చొప్పున జరిమానా విధించారన్నారు.



పట్టుబడిన సిలిండర్లు

### గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వపై దాడి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం బజార్లో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లపై అధికారులు బుధవారం దాడి చేశారు. కె.వీరవెంకట ఆంజనేయ ఈశ్వర పవన్ కుమార్ స్థానిక గొడౌన్‌లో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ ఎస్‌పి ఆదేశాలతో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయిస్ రెవెన్యూ సిబ్బంది సోదాలు నిర్వహించారు. ఆసమయంలో అక్రమంగా నిల్వచేసిన 39 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



# ఘనంగా సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

**జిల్లాలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలను బుధవారం వైసిపి ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. మొక్కలు నాటారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, స్వీట్లు అందించారు. రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. అలాగే వైస్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.**




చింతలపూడిలో..

**చింతలపూడి :** పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు సిఎం జగన్ అందిస్తున్నారని ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. జగన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి తహాశీల్దార్ కార్యాలయం వద్ద జగనన్న పచ్చతోరణంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కె.నాగు, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజాసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, మిర్యాల దీలీప్, వెంపా కృష్ణ, సిటీ మెడికల్ దుర్గారావు పాల్గొన్నారు. ఎఎంసి మార్కెట్ వద్ద ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి వేడుకలు నిర్వహించారు.

**బుట్టాయగూడెం:**సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జెడ్‌పి పాఠశాలలో అటవీ శాఖ అధికారిణి శ్రీవాణితో కలిసి జగనన్న పచ్చతోరణంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం వైఎస్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పిహెచ్‌సిలోని రోగులకు పండ్లు, రొట్టెలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.



టి.నరసాపురంలో..


**జంగారెడ్డిగూడెం :** జగన్ పుట్టినరోజు వేడుకలను పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఘనంగా నిర్వహించారు. తాడువాయి, చల్లవారిగూడెం ఆర్‌అండ్‌అర్ కాలనీల్లో వైసిపి నేతలు బ్రహ్మం, బద్దె కృష్ణ, విజయ్‌బాబు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గిల్ల వెంకటేశ్వర్లు, పెరుమాళ్, నరసింహారావు, రమణయ్య, రమణ, నజీర్, లక్ష్మణ్, పండు, నర్సి, వీరేంద్ర, అభి, ముకేష్, చింటు ఉన్నారు. జగన్ పుట్టినరోజు వేడుకలు స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సొసైటీ త్రి సభ్య కమిటీ ఛైర్మన్ వందనపు వెంకటేశ్వరరావు అధ్యక్షతన మహిళా శిశు సంక్షేమ శాఖ రీజియన్ ఛైర్మన్ వందనపు సాయిబాల పద్మ కేక్ కట్ చేశారు. సీతానగరం ఎంపిపి పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు పంచారు. పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ త్రిసభ్య కమిటీ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం శాంతి రమణ, పార్టీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీ, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి, వైస్ ఎంపిపిలు గుగ్గులోతు మోహనరావు, కుక్కల వరలక్ష్మి, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, సర్పంచి తెల్లం వెంకాయమ్మ, వెలుగు ఎపిఎం పద్మావతీ, ఎంపిటిసిలు, సర్పంచులు, వార్డు సభ్యులు, వైసిపి నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

**చాట్రాయి :** సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు చాట్రాయిలో సర్పంచి దామెర ఉష, ప్రసాద్ బాబు, ఎంపిటిసి సంకు. శివకుమారి, సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్ కట్ చేసి కార్యకర్తలకు అభిమానులకు పంచారు. నూజివీడు శాసనసభ్యులు మేక వెంకట ప్రతాప్ అప్పారావు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు.

**ముసునూరు :** మండలంలోని 16 గ్రామాల్లోని జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు కార్యక్రమాల్లో జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్, ఎంపిపి రాపర్ల కృష్ణకుమారి, సుబ్బారావు, వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచులు పేరం కృష్ణ పాల్గొన్నారు.

**జీలుగుమిల్లి :** ఎంపిపి కె.పోసమ్మ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి జగన్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు.



కైకలూరులో..

**జంగారెడ్డిగూడెం :** సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు వైసిపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎలిజా కేక్ కట్ చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఎంఎల్ఎ ప్రారంభించారు. సుమారు 200 మంది రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ కంచర్ల వాసవిరత్నం, ముప్పిడి వీరాంజనేయులు, జెడ్‌పిటిసి సభ్యులు బి.బాబ్జీ, మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్ కౌన్సిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సొసైటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. రోగులకు పౌష్టికాహారం అందించారు. అభివృద్ధి కమిటీ సొసైటీ డైరెక్టర్ భావన రుషి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



గణపవరంలో..

నారాయణపురంలో

**కొయ్యలగూడెం :** స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద వైసిపి పట్టణ అధ్యక్షులు సంకు కొండ ఆధ్వర్యంలో ఎంపిపి గంజిమాల రామారావు కేక్ కట్ చేసి జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. అనంతరం బిసి కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ల భాస్కర్‌రావు, మండల అధ్యక్షులు జి.నాగేశ్వరావు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎంపిటిసి గంటా శ్రీనివాస్ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అచ్యుతాపురంలో ఎంపిపి గంజిమాల రామారావు కేక్ కట్ చేశారు. ఎంపిటిసి మందపాటి కుమారి, హిస్టరీ బోర్డ్ డైరెక్టర్ మంగతాయారు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. గవరవరంలో పార్టీ గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బి.రత్నకుమారి, సెక్రటరీ యు.గంగాధర్ పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** సిఎం జగన్ అందిస్తున్న నవరత్నాలు పేదల జీవితాల్లో వెలుగు నింపుతున్నారని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని వల్లంపట్ల పంచాయతీ సాయంపాలెం, తిరుపతిపాడు గ్రామాల్లో జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో జగనన్న కాలనీలో నూతన గృహాలను ప్రారంభించారు. రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గం పార్టీ పరిశీలకులు పాతపాటి సర్రాజు, జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు, ఎంపిపి డి.లక్ష్మి, సర్పంచి తుమ్మూరి మాధవిలత, ఎంపిటిసి గాది ప్రసాదరెడ్డి, శ్రీనురాజు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, దాకారపు సూరిబాబు, వాసిరెడ్డి మధు పాల్గొన్నారు.

**గణపవరం :** జగన్ పుట్టినరోజు సందర్భంగా వరదరాజపురం కెవిపి ఫంక్షన్ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే అమలు చేసిన వ్యక్తి జగన్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**కైకలూరు రూరల్ :** మండలంలో సిఎం జగన్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాల్లో జగన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేకులు కట్ చేశారు. కైకలూరు మార్కెట్ వద్ద ఉన్న వైఎస్ విగ్రహం వద్ద ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు కేక్ కట్ చేశారు. వైసిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నోబుల్ నివాసం వద్ద వేడుకలు నిర్వహించి, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అన్నదానం చేశారు. పలు గ్రామాల్లో రక్తదాన శిబిరాలు, ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎఎంసి ఛైర్మన్ దండే పుష్పలత, ఎంపిపి అడవి కృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కె.బేబీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాలంటీరు పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలో ఖాళీగా ఉన్న ఐదు గ్రామ వాలంటీర్ల పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ రాఘవన్ తెలిపారు. ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, 29వ తేదీన ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని తెలిపారు. ఆగడాలలంకలో ఒకటి, అంబరుపేటలో రెండు, పోలసానిపల్లిలో ఒకటి, సూరప్పగూడెంలో ఒక పోస్టు ఖాళీగా ఉందన్నారు.

**జీలుగుమిల్లి :** మండలంలోని నాలుగు పంచాయతీల్లో ఖాళీగా ఉన్న నాలుగు వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ కె.మంగతాయారు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జీలుగుమిల్లిలో రెండు, కామయ్యపాలెంలో ఒకటి, తాటియాకులగూడెంలో ఒక పోస్టు ఖాళీగా ఉందని పేర్కొన్నారు.

## ఓటుకు ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తిచేయాలి

ప్రజాశక్తి - భీమడోలు



సమీక్షిస్తున్న ఎంపిడిఒ రాఘవన్

ఓటుకు ఆధార్ నమోదును త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఎంపిడిఒ రాఘవన్ కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల పరిధిలో ఓటుకు ఆధార్ అనుసంధానం 72 శాతం పూర్తయిందని మిగిలింది త్వరగా పూర్తిచేయాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులను ఉపాధి హామీ పనులకు అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఇకెవైసి 60 శాతం పూర్తయిందన్నారు. ఈ సమీక్షలో తహాశీల్దార్ ఇ.జాన్‌రాజు పాల్గొన్నారు.

## నూతన ఆవిష్కరణలకు అష్టావధానం దోహదం

ప్రజాశక్తి - ఉంగుటూరు

గణిత శాస్త్రంలో మేథోపరమైన నూతన ఆవిష్కరణలకు అష్టావధాన పక్రియ ఎంతగానో దోహద పడుతుందని ప్రముఖ గణితశాస్త్ర అవధాని డాక్టర్ టిఎస్‌విఎస్.సూర్యనారాయణమూర్తి అన్నారు. నేషనల్ గణిత దినోత్సవం సందర్భంగా మండలంలోని నారాయణపురం, శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీకాలేజీల్లో గణితశాస్త్రంలో అష్టావధాన పక్రియను బుధవారం నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. హైయ్యర్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ నతానియేలు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి గణిత శాస్త్ర నిపుణులు, అధ్యాపకులు, ప్రొఫెసర్లు పృచ్ఛకులుగా (ప్రశ్నలు సంధించే వారు) వ్యవహరించారు. అవధానిగా సూర్యనారాయణ మూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణంగా అష్టావధానం అంటే తెలుగు పద్యాలు, గ్రాంధికాలతో ఏకధాటిగా అనేక అంశాల్లో పృచ్ఛకులు అడిగే ప్రశ్నలకు అవధాని సమాధానాలు చెప్పడం. ధానికి భిన్నంగా గణితంలో కూడా అష్టావధానం కార్యక్రమానికి వినూత్నంగా నారాయణపురం కాలేజీలో నిర్వహించడం ఎంతో అభినందనీయమని పృచ్ఛకులు అన్నారు. పృచ్ఛకులుగా ఆచార్య డిఎస్ఎన్.శాస్త్రి, ఆచార్య బివిఎస్ఎన్.హరిప్రసాద్, డాక్టర్ కె.నవీన్‌కుమార్, ఆచార్య ఎస్‌విబి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ జెఎల్.రామ్‌ప్రసాద్, ఆచార్య ఎమ్‌జె.సుధాకర్, ఎస్.హేమలత వ్యవహరించారు. కార్యక్రమ కన్వీనర్ బాబూరావు, అధ్యాపకులు కొండా రవి అధ్యాపకులు పాల్గొన్నారు. జిల్లాలో పలు కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం అవధానిని, పృచ్ఛకులను సత్కరించారు. తొలుత కళాశాల విద్యార్థినులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.




ఉంగుటూరులో అష్టావధానం..




గణపవరంలో..

### ఘనంగా శ్రీనివాసరామానుజ జయంతి

**గణపవరం:**స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి మాట్లాడుతూ ముఖ్యఅతిథిగా పాల్గొన్న తాడేపల్లిగూడెం డిఆర్ గోయెంక ప్రభుత్వ డిగ్రి కళాశాల అధ్యాపకులు ఆర్‌కె.ఫణిందర్ మాట్లాడుతూ అనంత శ్రేణిసంఖ్య సిద్ధాంతం. విభజన సిద్ధాంతలపై రామానుజన్ చేసిన కృషిని వివరించారు. గణిత అధ్యాపకులు జివి.శారదాదేవి. మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ ప్రిన్సిపాల్ పి.మధురాజు. టి.అక్కిరాజు. శ్రీనివాస్‌రావు, అనురాధ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.